ప్రజాశక్తి
గురువారం 14 సెప్టెంబర్ 2023

## బస్‌ను పునరుద్ధరించరూ..

**ప్రజాశక్తి- పెదబయలు రూరల్:**మండలంలోని పలువురు ఉద్యోగులు బస్‌ను పునరు ద్ధరించాలని సంతకాల సేకరణ చేపట్టారు. ఉద్యోగుల కథనం మేరకు...పాడేరు డివిజన్ ఆర్టీసి డిపో నుండి వయా పెదబయలు, ముంచింగిపుట్టు మీదుగా డుడుమ బస్సు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా సర్వీసు తిరిగేది. ఈ మధ్య కాలంలో సదరు సర్వీస్ రద్దు చేసి కేవలం సాయంత్రం ఒకపూట మాత్రమే బస్సును నడుపుతున్నారు. దీంతో, ఇబ్బందికరంగా ఉంటుందనీ తెలిపారు. ముంచింగిపుట్టు అతి మారుమూల ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు డుడుమ బస్సులో ప్రతిరోజు ఉదయం పాడేరు నుండి పెదబయలు, ముంచింగిపుట్టు ప్రయాణిస్తుంటారు. బస్సు సర్వీస్ పునరుద్ధరించాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు.

# ఏజెన్సీలో గంజాయి సాగుపై ఉక్కు పాదం

### -ఒడిశా పోలీస్‌లతో కలిసి కార్యాచరణ
### - సాగు, రవాణాపై 9381123100 నెంబర్‌కు సమాచారం ఇవ్వండి
### - జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా



ఫోన్ నెంబర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి తుహిన్‌సిన్హా

**ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా ఏజెన్సీ ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో గంజాయి సాగును నిర్మూలించేందుకు రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ యంత్రాంగం ఉక్కు పాదం మోపుతోంది. ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో విస్తృతంగా గంజాయి సాగుతున్నట్లు గుర్తించిన అల్లూరి జిల్లా పోలీస్ శాఖ ఈ ప్రాంతంలో సమూలంగా గంజాయి నిర్మూలనకు ఒడిస్సా పోలీస్‌లతో సమన్వయ కార్యాచరణకు సిద్ధమవు తోంది. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు గంజాయి తోటల పెంపకం ఎగుమతుల ప్రక్రియను పూర్తిగా నియంత్రించాలనే భావంతో పోలీస్ శాఖ కదులుతోంది. ఇప్పటికే అల్లూరి ఏజెన్సీలో గంజాయి తోటల నిర్మూలనకు పోలీస్ శాఖ శ్రీకారం చుట్టింది.**

జి.మాడుగుల, జీకే వీధి, పాడేరు మండలాల్లో గంజాయి తోటలను గుర్తించి ధ్వంసం చేసి పలువురిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలించారు. ఇక మారుమూల ప్రాంతాల్లో గంజాయి సాగు సమాచారం రాబట్టేందుకు పోలీస్ శాఖ నిర్దిష్టమైన చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల నుంచి రహస్య సమాచారం సేకరించేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంది. అక్రమ గంజాయి రవాణా, సాగుకు కు సంబంధించి జిల్లా పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో (ఎన్‌డిపిఎస్‌ఎల్) గంజాయి నివారణ విభాగం ఏర్పాటు చేశారు.

**గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు...**

గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టామని ఇందులో భాగంగా గ్రామాల్లో గంజాయి సాగు పై సమాచారం ఇవ్వడంలో విఫలమైతే సాగు భూముల యజమానులు, గ్రామస్థాయి అధికారులపై కూడా ఎన్‌డిపిఎస్ (1985 సెక్షన్ 46)చట్ట ప్రకారం జైలు శిక్ష లేదా జరిమానా వంటి చర్యలు ఉంటాయని అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. గంజాయి నిర్మూలనకు పలు విధాలుగా పటిష్టంగా చేపడుతున్న చర్యలను ఆయన విలేకరుల సమావేశంలో వివరించారు.గంజాయి సాగు పైన రవాణా పైన సమాచారాన్ని ఈ నెంబర్ 9381123100కు ఎవరైనా తెలియ చేయవచ్చునని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.గంజాయి నిర్మూలన కోసం పటిష్టమైన ఇన్ఫార్మర్ వ్యవస్థ తమకు ఉందని వారు సమాచార అందించినప్పుడు తగిన పారితోషికాలు ఇస్తున్నామని ఇకపై కూడా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

**పండ్ల తోటల పెంపకానికి తోడ్పాటు**

ఏజెన్సీలో గంజాయి సాగును నిర్మూలించే చర్యలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి తోడ్పాటు అందించేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. ఈ మేరకు 2023 సంవత్సరంలో సాగు నిమిత్తం ప్రభుత్వం, పోలీసు శాఖ సహకారంతో 7896 ఎకరాలలో జీడిపప్పు, సీతాఫలాలు, స్వీట్ ఆరెంజ్, యాసిడ్ లైమ్, జామ, కొబ్బరి, సపోటా, చింతపండు, మొరింగ, మామిడి, అవకాడో, నూనె మొక్కలు, డ్రాగన్ ఫ్రూట్స్, దానిమ్మ, జామన్, జాఫ్రా, కాపీ, రాజమా మొదలైన పంటల మొక్కలు సరఫరా చేసి సాగుకు తోడ్పాటు అందించినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలో ప్రధాన పంట సిల్వర్ వోక్ మొక్కలను 1516.5 ఎకరాలకుగాను 10,62,061 మొక్కలను ఈ ఏడాది పంపిణీ చేసినట్లు తెలిపారు. యువత గంజాయికు బానిస కాకుండా ఉండేందుకు గాను, కాలేజీల్లోనూ, స్కూళ్లలోనూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పరివర్తన కార్యక్రమంలో ద్వారా చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అల్లూరి జిల్లాలో జరిగే సంతల్లో కళాజాతాల ద్వారా గిరిజన ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) పి.అనిల్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి వేణుగోపాల్, సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి పాల్గొన్నారు.

# పాఠశాలను ఏర్పాటు చేయరూ...

### -2 కిలోమీటర్లు కాలినడకన వేరే స్కూల్‌కు..
### -అవస్థలు పడుతున్న విద్యార్థులు

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:**మండల కేంద్రానికి కూతవేటు దూరంలో కర్రిముఖిపుట్టు గ్రామ పంచాయతీ పాఠశాలలకు అదే గ్రామ సచివాలయంకు చెందిన విద్యార్థులు వెళ్లి చదువుకునేందుకు అవస్థలు పడుతున్నారు. గేదాలబందా, బరెంగుల, దాసరిపుట్ గ్రామ విద్యార్థులు సుమారు 2 కిలోమీటర దూరంలో ఉన్న కరీముకిపుట్ ఎంపీపీ స్కూల్‌కు దాదాపుగా 40మంది విద్యార్థులు కాలి నడకన వెళ్లి చదుకొంటున్నారు. ఈ మూడు గ్రామాలలో ఎస్టీ పివిటి తెగలకు చెందిన కోదు, పొజ్జా తెగల విద్యార్థులు ఉన్నారు. మూడు గ్రామాల నడుమ ఒక ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసి అక్కడి పిల్లలకు విద్యాభ్యాసాన్ని అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు జి జీనభందు, జి.నారాయణ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,నాలుగు రోజులు ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో చిన్నారులు విద్యాభ్యాసానికై ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని కాలినడకన వెళ్తున్నారన్నారు. మార్గమధ్యంలో కల్వర్టు పై నుంచి వరద నీరు పోటెత్తడంతో విద్యార్థులు వాగు దాటలేక అక్కడే స్తంభించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై వెంటనే జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ అభిషేక్‌పే స్పందించి మూడు గ్రామాలకు ఒక పాఠశాల నిర్మించి విద్యార్థులకు మెరుగైన విద్య అందజేయాలని, లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మండల ఎంఈఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

పాఠశాలకు నడిచి వెళుతున్న విద్యార్థులు

## ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

### ఆలస్యంగా వెలుగులోకి...

**ప్రజాశక్తి-దుంబ్రిగుడ:**మండలంలోని జాంగూడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పద్దు నయోమి అనే గిరివిద్యార్థిని స్వగ్రామమైన గసభలో శనివారం అకస్మాత్తుగా మృతి చెందినట్లు తెలిసింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో ఆరోగ్యంగానే ఉంటూ వారి గ్రామానికి వెళ్ళిన తర్వాత గత శనివారం అస్మాత్తుగా మృతి చెందడంతో దీనిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అనారోగ్యంతో మృతి చెందిందా లేక ఇతర వేరే కారణాలతో చెందిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం ఆలస్యంగా బయటకు తెలియడంతో స్థానిక గిరిజన సంఘాలు, మహిళ సంఘాలుతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యార్థిని మృతికి కారణాలపై పాఠశాలలో సందర్శించి ఆరా తీస్తున్నారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి బాధిత విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలి

### - ఆదివాసీ గిరిజన మహిళా సంఘం

మాట్లాడుతున్న విజయ, హైమావతి

**దుంబ్రిగుడ:** మండలంలోని జాంగుడ ఆశ్రమ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి నయోమి విద్యార్థిని మృతిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని ప్రధానోపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలని ఆదివాసి గిరిజన మహిళ జిల్లా అధ్యక్షురాలు వి విజయ, ప్రధాన కార్యదర్శి హైమావతి డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఉపాధ్యాయుల వేధింపులు కారణంగా మృతతి చెందినట్లు తెలిసిందన్నారు. పాఠశాలలో ఆరోగ్యంగానే ఉంటూ గ్రామానికి వెళ్ళిన తర్వాత అకస్మాత్తుగా మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ప్రధానోపాధ్యాయురాలు, మేట్రిన్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. దీనిపై ఉపాధ్యాయులను సంప్రదిస్తే పొంతనలేని సమాధానం ఇస్తుండడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులు వెంటనే సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని, మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసి గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

## కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా పరశురాం

**ప్రజాశక్తి-దుంబ్రిగుడ:**కాంగ్రెస్ పార్టీ మండల నూతన ప్రధాన కార్యదర్శిగా తాంగుల సీతారాంను నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర ఆదివాసి చైర్ పర్సన్ పి.శాంతకుమారి తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, నూతనంగా నియామకమైన ప్రధాన కార్యదర్శి పరశురాం పార్టీ నాయకులను, కార్యకర్తలను సమన్వయంగా చేసుకొని మండలంలో పార్టీ పూర్వ వైభవానికి పని చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి పి చిన్నస్వామి పాల్గొన్నారు.

# చంద్రబాబు అరెస్టు అన్యాయం

### టిడిపి రిలే నిరాహార దీక్షల్లో నేతలు

పాడేరులో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, టిడిపి నాయకులు, కార్యకర్తలు

**ప్రజాశక్తి-పాడేరుటౌన్**

ప్రభుత్వం అవినీతి, అరాచకత్వంపై ప్రశ్నిస్తున్నందుకే ప్రతిపక్ష నేతలపై కక్షతోనే టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేశారని పాడేరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. చంద్రబాబు అరెస్ట్ ను నిరసిస్తూ ఆ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు జిల్లాలోని ఆయా మండలాల్లో బుధవారం ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఆర్ టిసి బస్ స్టేషన్ దగ్గరలో మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి నేతృత్వంలో పార్టీ శ్రేణులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చంద్రబాబు, లోకేష్ పర్యటనల్లో ప్రజాదరణ చూసి ఓర్వ లేకనే కుట్ర పూరితంగా చంద్రబాబును అరెస్ట్ చేశారని ఆరోపించారు. ముమ్మాటికి ఇది కక్ష సాధింపేనని అన్నారు. అరాచక ప్రభుత్వాన్ని బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొర్రా నాగరాజు, విజయరాణి, భవాని రాము, వంజంగి కాంతమ్మ, కోడా వెంకట సురేష్ కుమార్, గబ్బాడ సింహాచలం, సోమేలి చిట్టిబాబు, కొట్టగుల్లి రమేష్, చల్లంగి లక్ష్మణరావు, జ్ఞానేశ్వరి, డిప్పల కుమారి, గంగపూజ శివకుమార్, డప్పోడి వెంకటరమణ, బుక్క జగదీష్, బుద్ధ జ్యోతి కిరణ్, కిల్లో రాధాకృష్ణ, బింబాబు, పిన్నయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

**రంపచోడవరం :** టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును, ఆ పార్టీ శ్రేణులపై జరిగిన దమనకాండ, జగన్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలకు నిరసనగా మంగళవారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాబుతో నేను-రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, నాయకులు కారం సురేష్ బాబు, పాము అర్జున్, గురుకు శేషు కుమార్, పెంటపాటి అనంత మోహన్, మట్టా మెహర్‌బాబా గౌడ్, పోడియం శ్రీనుబాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

**విఆర్.పురం :** మండలంలోని రేఖపల్లి ఎన్టీఆర్ జంక్షన్లో జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, టిడిపి నాయకులు ముత్యాల రామారావు ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి రంగారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా మచ్చలేని నాయకునిగా బయటకు వస్తారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బరపాటి ప్రకాష్ రావు, బురక కన్నారావు, సర్పంచ్ అందేలా సీతారామరెడ్డి, వైస్ ఎంపీపీ వడ్డాణపు భాగ్యలక్ష్మి, సీనియర్ నాయకులు ముత్యాల రమేష్, ఆకోజు భాగ్యలక్ష్మి, సవలం రాజేంద్రప్రసాద్, బొర్రా నరేష్, కోట్ల బాలయ్య, బీరక సూర్య ప్రకాష్ రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు గారి
అక్రమ అరెస్టుకు నిరసనగా
సామూహిక

రంపచోడవరంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, టిడిపి శ్రేణులు

**సిపిఎం సంఘీభావం**

**విఆర్.పురం :** రేఖపల్లిలో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సిపిఎం నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుపై టిడిపి శ్రేణులు నిరసన తెలియజేస్తే అణచివేతకు పూనుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు గుటల శ్రీనివాస్, సోడే మల్లయ్య, వీర్ల నాగేశ్వరావు సుబ్బారావు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి చర్యలు

**ప్రజాశక్తి-రంపచోడవరం**

:ఐసిడిఎస్ రంపచోడవరం ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సిడిపిఒ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంపచోడవరం మండలంలోని టి.బూరుగుబందిలో అంగన్వాడీ కార్యకర్త, గిన్నెపల్లి, దిరిసినపల్లిలో అంగన్వాడీ సహాయకులు, దేవీపట్నం మండలంలోని మామిడివలసలో మినీ అంగన్వాడీ కార్యకర్త, గంగలపాలెం, సిహెచ్.బీంపల్లి, ఇందుకూరు-2లో అంగన్వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 14 నుండి 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్త, మినీ కార్యకర్త, ఆయా పోస్టులకు స్థానిక స్థిర నివాసంతో పాటు వివాహిత స్త్రీలు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థి తప్పనిసరిగా 10వ తరగతి పాసై ఉండాలని, లేకుంటే తదుపరి ఎక్కువ తరగతి పాస్ అయిన అభ్యర్థి దరఖాస్తును పరిశీలిస్తామని చెప్పారు. 2023 జులై 1 నాటికి 21 సంవత్సరాల నిండి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు 21 సంవత్సరాలు నిండిన వారు లేనప్పుడు 18 సంవత్సరాలు నిండిన అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత పొందిన అభ్యర్థులకు మౌఖిక పరీక్ష తేదీ, స్థలం తరువాత తెలియజేస్తామన్నారు. నివాస, కులం ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ జెరాక్స్ కాపీలపై గెజిటెడ్ ఆఫీసర్ వారిచే అటెస్టడ్ చేయంచి రెండు సెట్లు, రెండు ఫొటోలు కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు రంపచోడవరం, ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

**అడ్డతీగల :** మండల కేంద్రంలోని అడ్డతీగల-2లో అంగన్వాడీ ఆయా, వీరవరం పంచాయితీ చాకిరేవులలో మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సిడిపిఓ దీప్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

## 200 కిలోల గంజాయి పట్టివేత

### నలుగురు నిందితుల అరెస్టు

**ప్రజాశక్తి - మోతుగూడెం**

అల్లూరి సీతారామరాజు జిల్లా, వై.రామవరం మండలం, డొంకరాయి పోలీస్ స్టేషన్ సిబ్బంది, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది కలిసి పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కారులో తరలిస్తున్న రూ.6 లక్షల విలువైన 200 కేజీల గంజాయి పట్టుబడినట్లు డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తెలిపారు. గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుండి 200 కేజీల గంజాయి, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఇద్దరు మహారాష్ట్ర, ఒకరు తెలంగాణ, మరొకరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ సందర్భంగా డొంకరాయి ఎస్సై శివ కుమార్ మాట్లాడుతూ గంజాయిని సాగు చేసినా, రవాణా చేసినా, గంజాయి కలిగి ఉన్నా కఠిన చర్యలు తప్పవన్నారు.

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి లలితకుమారి

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

**ప్రజాశక్తి-మారేడుమిల్లి**

ప్రజా సమస్యలను పరిష్కారానికి ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీసీ సార్ల లలిత కుమారి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ లలిత కుమారి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లు నుంచి 5 మండలాల గిరిజన గ్రామాలకు తాగునీటిని అందిస్తున్న సత్యసాయి మంచినీటి పథకం పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో ఇది నీరుగారిపోతోందని, పథకం నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారం ప్రజాప్రతినిధులకు తెలపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిసె పర్యాటక ప్రాంతానికి వచ్చే పర్యాటకుల నుంచి వసూలు చేస్తున్న ఆదాయం మీద విచారణ జరిపించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. మారేడుమిల్లి మీదగా గడిసెకు వెళ్లే ప్రాంతంలో సీబీఈటీ ఆధ్వర్యంలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ కొండా జాకబ్ అటవీశాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయంతి, తహశీల్దారు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కొండ రవికుమార్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న తాపీ పనివారి సంక్షేమ సంఘం నాయకులు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-అడ్డతీగల**

భవన నిర్మాణ కార్మికుడు మట్ట ఆంజనేయులు మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి వినాయక తాపీ పనివారి సంక్షేమ సంఘం తరుపున మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నక్క పెంటారావు, చాగంటి ఆదినారాయణ, జి.సురేష్ బాబు, చీకట్ల సామెల్ మాట్లాడుతూ సంఘం నిబంధనల ప్రకారం సంఘంలోని సభ్యులుగా ఉన్న కార్మికులు కష్టాల్లో ఉన్నప్పుడు సంఘం తరుపున ఆర్థిక సహాయం చేయడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఆంజనేయులు కుటుంబానికి తమ సంఘం అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతాజి అబ్బులు, కార్పెంటర్స్ యూనియన్ నాయకులు నానాజీ, పెద్దకాపు, దాకమూరి శ్రీను, లోవరాజు, తలారి శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి**

మండలంలోని జాతీయ రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో తంటికొండ గ్రామసమీపంలో రహదారిపై బురదలో బుధవారం ఆర్టీసీ బస్సు చక్రాలు కూరుకుపోవడంతో బస్సు నిలిచిపోయింది. దీంతో గంటల తరబడి వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో హైవే అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టి రాకపోకలను పునరుద్ధించారు.

బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

# మన్యంలో భారీ వర్షం

### -కూలిన ఇల్లు
### -చిన్నారి మృతదేహాన్ని తరలించేందుకు అవస్థలు

**ప్రజాశక్తి-యంత్రాంగం**

**ముంచింగిపుట్టు:**మండలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఓ చిన్నారి మృతదేహాన్ని తరలించేందుకు కుటుంబీకులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ ఘటన వివరాలు... మండలంలోని లక్ష్మీపురం పంచాయితీ తుమ్మిడి పుట్‌లో ఈనెల 11న అనారోగ్యంతో బురిడీ భాను (10) మృతి చెందింది. మండలంలో ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో మృతదేహాన్ని దహన సంస్కారాలు చేయడానికి వీలుకాలేదు. మృతదేహాన్ని రెండు రోజులుగా ఇంటి వద్ద ఉంచారు. బుధవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో చిన్నారి మృతదేహాన్ని రెండు రోజులు తరువాత వాగులో భుజాలపై మోసి, దాటించి దహన సంస్కరణలను నిర్వహించారు.

తుమ్మిడిపుట్టు గ్రామంలో 130 కుటుంబాలు ఉండగా 550 మంది పివిటిజీలు నివసిస్తున్నారు. వంతెన నిర్మించాలని గతంలో అనేక మార్లు స్థానిక సర్పంచ్ కొర్ర త్రినాథ్ స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలకు వినతి పత్రాలు సమర్పించారు. ఇపటికైన ప్రభుత్వం, అధికారులు స్పందించి తుమ్మిడిపుట్ గెడ్డ వద్ద వంతెన నిర్మాణం చేయాలని సర్పంచ్ కొర్ర త్రినాథ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పాల్గున గెలిచిన వెంటనే తమ గ్రామానికి కల్వర్టు నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చి గ్రామ పీవీటిజి లకు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అల్లూరి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోలు తక్షణమే స్పందించి వంతెన నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు.

**మూగజీవాలకు తప్పని అవస్థలు**

మండలంలో అతిమారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం పంచాయతీ కర్ల పొథోర్ వాగు వద్ద నీటిలో

గెడ్డలో చిక్కుకున్న పశువులు

మూగజీవాలను రక్షించుకునేందుకు ఆ గ్రామ వాసులు ప్రాణాలకు తెగించి అనేక అవస్థలు పడ్డారు. వివరాల్లోకి వెళితే... గత నాలుగు రోజులుగా మండలంలో ఎడతెరిపి లేని వాన కురవడంతో కర్ల పొథోర్ గ్రామం ద్వీపకల్పంగా మారింది. వర్షాలకు కొండలు, కోనల నుండి అత్యధిక వరద నీరు చేరి గెడ్డ ఉప్పొంగుతుంది. ఈ సందర్భాలలో ఆ గ్రామ వాసులతో పాటు మూగజీవులు కూడా జల దిగ్బంధనంలో చిక్కు కుంటున్నాయి. నాలుగు రోజుల నుండి మూగజీవులకు మేత లేదు. దీంతో. వాగు దాటించి పశువులను మేతకు తీసుకువెళ్లాలనే ప్రయత్నంలో ఉప్పొంగిన వరద నీటిలో మూగజీవాలు చిక్కుకు పోయాయి. గమనించిన గ్రామస్తులు ఏకమై తమ ప్రాణాలను తెగించి మూగజీవాల ప్రాణాలను కాపాడుకున్నారు.ప్రతి గ్రామానికి వంతెనల నిర్మాణాలు చేపట్టి గిరిజనుల ప్రాణాలను కాపాడాలని పలువురు కోరారు.

చిన్నారి మృతదేహాన్ని శ్మశానానికి తరలిస్తున్న కుటుంబీకులు

**పెదబయలు**:మండలంలో మూడురోజుల పాటు కురిసిన భారీ వర్షాలతో ఆదివాసీ గిరిజన రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి ఏరియాల్ సర్వే నిర్వహించి బాధిత కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. గోమాంగి పంచాయతీ సంత వీది గ్రామంలో కుంబిడి బాలకృష్ణకు చెందిన మట్టి ఇల్లు వర్షం దాటికి నేల కూలింది. దీంతో, తల దాచుకోవడానికి నిలువ నీడ లేకుండా పోయింది. ఉన్న కొద్దో గొప్పో ఆహార పదార్థాలు తడిసి ముద్దయ్యాయి. దిక్కు తోచని స్థితిలో ఉన్న తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు వేడుకొంటున్నారు.

ఇదే పంచాయతీకి చెందిన కారుగొండ గ్రామం లో వర్షాల దాటికి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.బత్తిరి చిన్నయ్యకు చెందిన గేదె మేకలు వరద దాటికి కొట్టుకు పోయాయి.రైతు చిన్నయ్య లభో దిబో మంటూ రోదిస్తూ ఆవేదన వ్యక్త పరిచాడు. వరి నారు మళ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. కారుగొండ నుండి తాడే వీధి, బొడ్డ పుట్టు, కుంతూర్ గ్రామాలకు వాగులు, గెడ్డలు దాటి వెళ్లాల్సి ఉంది. వర్షాలు పడితే ప్రాణాలకు తెగించి రాకపోకలు సాగించాల్సి ఉంది.

**హుకుంపేట:**మండలం లోని పలు ప్రాంతాల్లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గెడ్డలు సముద్రాన్ని తలపిస్తున్నాయి. మండలం లోని చిడిపుట్టు, సంతారి, ఉప్పు గెడ్డలు పొంగి ఉధృతంగా బుధవారం ఉదయం ప్రవహించాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు, కల్వర్టులు నిండి పొంగి పోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

**జిమాడుగుల** :గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బొయితెల పంచాయతీ మద్దిగరువు గ్రామ సమీపంలో ఉన్న కొండగెడ్డ వంతెన వరద ఉధృతికి కొట్టుకు పోయింది. వరి పొలాలన్నీ నీట మునిగి జలమయమయ్యాయి. చాపగడ్డ గ్రామ సమీపంలో బ్రిడ్జి పైనుండి వరద నీరు ప్రవహిస్తుంది, దీంతో పలు గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచి పోయింది.

**సీలేరు:**జీకే వీధి మండలం సీలేరులో నాలుగు రోజుల నుంచి కుండపోత వర్షాలు కురుస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వీధులన్నీ చిత్తడి చిత్తడిగా మారాయి. మునుపెన్నడూ లేనివిధంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కుంభవృష్టి వర్షం కురిసింది. బుధవారం ఉదయం అదే తరహాలో వర్షం కురవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం వర్షం తగ్గుముఖం పట్టడంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు. రైన్ నుంచి సప్పర్ల వరకు రహదారి పనులు చేస్తుండడంతో పాటు వర్షాలు కురవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**కూలిన చెట్టు**

వారం రోజులుగా సీలేరులో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో సీలేరు తొమ్మిదో క్రాస్ రోడ్‌లో ఎండిన వృక్షం బుధవారం ఉదయం 10 గంటలకు కూకట్‌వేలుతో కూలిపోయి విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కూలిన ప్రదేశంలోనే ఈశ్వరరావు అనే వ్యక్తి వర్క్ షాప్ ఉంది. అయితే ఆ సమయంలో ఈశ్వరరావు వర్క్ షాప్ నిర్వహించకపోవడం, ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం ఈశ్వరరావు, నక్క జ్ఞానేశ్వర్ రావు, మలసాల రమణ తదితరులు ఏపీ జెన్కో ఏఈ కిరణ్ కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆయన స్పందించి సిబ్బందిని సంఘటన ప్రదేశానికి పంపించారు. వారు విద్యుత్ వైర్లపై పడిన భారీ వృక్షాన్ని తొలగించి, విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

# నకిలీ కుల ధ్రువపత్రం జారీపై చర్యలు

**ప్రజాశక్తి -పాడేరు:** అరకులోయ మండలం లో నకిలీ కుల దృవపత్రం జారీపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అందుకు బాధ్యులైన సిబ్బంది పై చర్యలకు ఉపక్రమించారు. ఒక వాలంటీర్ తో పాటు మండల కార్యాలయం రెవెన్యూ సిబ్బంది పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా భవిష్యత్తులో ఎక్కడైనా ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.అరకులోయ మండలం పెదలబుడు సచివాలయం ఫరిధిలో కొండ వీధికి చెందిన పిట్టల రాంబాబు అనే వ్యక్తికి ఎస్టీ భగత కుల దృవీకరణ పత్రం జారీపై ఆదివాసీ ప్రజా సంఘాల ఐక్య వేదిక చేసిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించి వెంటనే విచారణకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు అరకు లోయ తహసిల్దార్ వేణుగోపాలరావు మంగళవారం విచారణ చేపట్టిన విషయం విధితమే. సంబంధిత వ్యక్తిని ఆధారాలతో విచారణకు హాజరు కావలసినదిగా కోరినప్పటికీ ఎటువంటి ఆధారాలు లేకుండా విచారణకు హాజరైనందున విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసినట్లు తహసిల్దార్ వేణుగోపాలరావు తెలిపారు. 20వ తేదీన విచారణ చేపట్టి పూర్తి నివేదికను జిల్లా స్థాయి కమిటీకి సమర్పించి గతంలో జారీ చేసిన దృవపత్రం రద్దు చేయటంతో పాటు నిభంధనల మేరకు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేయటం జరుగుతుందని తహసిల్దార్ వేణుగోపాలరావు వివరించారు. అదేవిధంగా శరభగుడ గ్రామంలో ఒడిషాకు చెందిన వ్యక్తి వాల్మీకి దృవపత్రంతో చలామణి అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దానిపై కూడా విచారణ జరిపి తగు నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.

# 17న వ్యాస రచన పోటీలు

**ప్రజాశక్తి-జి.మాడుగుల:** మండల కేంద్రంలో శ్రీ మత్స్య మడుగులమ్మ యూత్ అధ్యర్యలో వ్యాస రచన పోటీలను. ఈ నెల 17న ఆదివారం నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు ఎం నారాయణరాజు, ఎంజై సింహరాజు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు.సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, యువత మత్తు పదార్థాలకు బానిస కావడం వంటి అంశాలపై అవగాహన కల్పించడం కోసం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యాస రచన పోటీల్లో గెలిచిన వారికి షీల్డ్, నగదు బహుమతి ప్రధానం చేస్తున్నట్లు చెప్పారు.

# మేధావుల మౌనం ప్రమాదకరం

**ప్రజాశక్తి-సీతమ్మధార :** ప్రజల్ని పరిపాలించాల్సిన, పరిరక్షించాల్సిన రాజకీయ నాయకులు విఘాతం కల్గించినప్పుడు మేధావుల మౌనం భావితరాల భవిష్యత్తుకు ప్రమాదకరమని తెలుగుదేశం యువ నాయకులు, మిషన్ కర్షక దేవోభవ ప్రాజెక్ట్ జాతీయ చైర్మన్ ఆడారి కిషోర్ కుమార్ అన్నారు. బుధవారం విశాఖపట్నంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మంగళవారం విశాఖ విమానాశ్రయంలో వినూత్న రీతిలో నిరసన తెలిపానన్నారు. రాజకీయ క్రీడల్లో భాగంగానే ఆయన్ను జైలు పాల్జేశారన్నారు.

తాము గత 47 రోజులుగా రైతులకు మేలు జరగాలని, వారికి కనీస గిట్టుబాటు ధర లభించాలని కోరుతూ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ మిషన్ కర్షక దేవోభవ ప్రాజెక్టును ఎందరో మేధావులు అభినందించి ప్రోత్సహిస్తున్నారన్నారు. అతి త్వరలోనే రైతుల అందరితో కలిపి ఒక సదస్సు నిర్వహించి వారికి కావలసిన కనీస అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. తమ హైదరాబాదు పర్యటనలో ఐటీ సంస్థల ప్రతినిధులు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రైతులకు తమ వంతు సహకారాన్ని అందించేందుకు ఆమోదం తెలిపారని చెప్పారు.

# 14వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

**ప్రజాశక్తి-సీతమ్మధార :** జివిఎంసి 14వ వార్డు పరిధి నరసింహనగర్ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఇంటింటికీ వెళ్ళి ఇప్పటివరకు ప్రభుత్వ చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, పేద ప్రజలకు ఆర్థిక స్వాలంబన చేకూర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌రాజు, ఆళ్ల శివగణేష్, నూకరాజు, వార్డు నాయకులు బల్లా శ్రీను, కె.సత్యానారాయణ, కోడూరి సుశీల, రాజ్ కుమారి, మళ్ళ శ్రీను, తాడి వెంకటరెడ్డి, రమణ మూర్తి, వసంతల అప్పారావు, బోగవల్లి గోవింద్, వెంకటేష్ పాల్గొన్నారు.

# పేడాడ రమణికుమారికి అభినందనలు

**ప్రజాశక్తి -మధురవాడ :** అంబేద్కర్ యూనివర్సిటీ పాలకవర్గ సభ్యులుగా నియమితులైన పేడాడ రమణికుమారికి వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు అభినందనలు తెలిపారు. బుధవారం ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రవి రెడ్డి, రాధ, రజిని, యువశ్రీ, రాజేశ్వరి, భాను, వరలక్ష్మి, స్రవంతి పాల్గొన్నారు.

# ఘనంగా లక్ష తులసీ దళ పూజ

**ప్రజాశక్తి -పద్మనాభం :** పద్మనాభంలోని అనంతపద్మనాభ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కుంతీమాధవస్వామి ఆలయంలో లక్ష తులసీదళ పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే అభిషేకాలు, 9 గంటల నుంచి తులసీదళ పూజలు ప్రారంభించారు. పలు గ్రామాల నుంచి మహిళలు పాల్గొన్నారు. స్థానిక ఎంపిపి రాంబాబు దంపతులు పాల్గొన్నారు. కొండపైన ఉన్న అనంత పద్మనాభస్వామి, కొండ దిగువన ఉన్న కుంతీమాధవస్వామికి ప్రత్యేక పూజ జరిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో నానాజీబాబు, సత్యనారాయణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి-పాడేరు:**అల్లూరి జిల్లాలోని పాడేరు, రంపచోడవరం డివిజన్లో అంగన్వాడీ పోస్టుల ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అల్లూరి జిల్లా పాడేరు నియోజక వర్గ ఫరిధి పాడేరు డివిజన్‌లో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జి.కె వీధి, కొయ్యూరు, మండలాలలో 12 ఖాళీలు, రంపచోడవరం నియోజక వర్గ ఫరిధి రంపచోడవరం డివిజన్ లో రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల, రాజవొమ్మింగి, గంగవరం మండలాలలో 17 ఖాలీలు, చింతూరు డివిజన్‌లో చింతూరు, కూనవరం, ఏటపాక మండలాలలో 25 ఖాళీలు మొత్తం ఖాళీగా ఉన్న 54 అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు ఈనెల 14 నుండి 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు సంబంధిత శిశు అభివృద్ధి పథకం అధికారికి నేరుగా లేఆ పోస్ట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.అంగన్వాడీ కార్యకర్త, ఆయా, మినీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేయదలచిన మహిళలు తప్పనిసరిగా పదోతరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని, ప్రధానంగా స్థానికంగా నివాసం కలిగి, వివాహిత స్త్రీ ఉండాలని కలెక్టర్ తెలిపారు. 2023 జూలై 1 నాటికి అభ్యర్థులు 21 సంవత్సరములు పూర్తి చేసి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. 21 సంవత్సరాల లోపు అభ్యర్థులు లభించని పక్షంలో 18 సంవత్సరాలు పూర్తయిన వారి దరఖాస్తులు పరిశీలించబడతాయని, కేవలం ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు కేటాయించిన కేంద్రాలకే ఇది వర్తిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఎంపికలో పదవ తరగతి ఉత్తీర్ణతకు 50 మార్కులు, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు ఐదు మార్కులు, వితంతువులకు ఐదు మార్కులు, మైనర్ పిల్లలు కలిగి ఉన్న వితంతువులకు ఐదు మార్కులు, పూర్తి అనాథ, క్రెచ్, హెూమ్, ప్రభుత్వ సంస్థలలో నివశించు సత్ప్రవర్తన సర్టిఫికెట్ కలిగిన వారికి 10 మార్కులు, అర్హత కలిగిన వికలాంగ వ్యక్తులకు ఐదు మార్కులు మౌఖిక పరీక్షకు 20 మార్కులు మొత్తం 100 మార్కులు ఉంటాయని తెలిపారు. మార్కుల ఆధారంగా పూర్తి పారదర్శకతతో నియామకాలు జరుగుతాయని, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.అభ్యర్థులు మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని, వారి అర్హతలను, మార్కులను పరిశీలించి ఎంపిక చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

**జిమాడుగుల:** మండలంలో కే.కోడపల్లి పంచాయతీలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల మినీ అంగన్వాడీ కార్యకర్తల నియామకానికి ఈనెల 14వ తేదీ నుండి 22వ తేదీ వరకు నియామకాలు జరుగుతున్నట్టు స్థానిక సిడిపిఓ సువర్ణమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వివాహిత మహిళా అభ్యర్థుల నుండి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు.

# ఐటి వెలిగేనా !

### - విశాఖలో అపార అవకాశాలున్నా ప్రణాళికలేవీ ?

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

రాష్ట్ర విభజన తర్వాత 'ఐటి క్యాపిటల్‌గా విశాఖ' అన్న ప్రచారం జోరుగా సాగిన సంగతి తెలిసిందే. అయితే అందుకు తగ్గట్టుగా సంస్థలను నెలకొల్పడం గత ప్రభుత్వం నుంచి నేటి వైసిపి ప్రభుత్వం వరకూ జరగలేదనే చెప్పాలి. విశాఖ నగర పరిధిలోగల మధురవాడ, రుషికొండ హిల్స్‌పై ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థలు సుమారు 80 వరకూ పనిచేస్తున్నాయి. కొత్త పరిశ్రమల కోసం సరైన ప్రణాళికల్లేక నిరుద్యోగ యువత, ఇంజినీరింగ్ యువతీ, యువకులు ఉద్యోగాల కోసం నేటికీ ఎదురు చూస్తున్నారు. అయితే సంస్థలు ఎన్ని వచ్చినా దిగ్గజ ఐటి సంస్థ ఇన్ఫోసిస్ రాకపైనే అందరి దృష్టీ ఉంది. బెంగళూరు, హైదరాబాద్‌ల్లో పనిచేస్తున్న ఐటి ఉద్యోగుల్లో ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి వెళ్లినవారున్నారు. అటువంటి వారిని దృష్టిలో పెట్టుకుని ఇన్ఫోసిస్ కార్యకలాపాల కోసం ఆ సంస్థ విశాఖను మెయిన్ సెంటర్‌గా ఎంపిక చేసుకున్న విషయం తెలిసిందే. దేశంలోని 10 స్టార్టప్ నగరాల్లో విశాఖ కూడా ఉండడంతో ఇక్కడ రూ.40 కోట్ల పెట్టుబడితో హెచ్‌ఎస్‌బిసి పక్కనగల ఖాళీ స్థలంలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిపిఐఎల్) ఏర్పాటు చేస్తామంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో విశాఖకు ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. విశాఖ నగరంలో ఐటి ప్రమోషన్ ఈవెంట్ - 2022లో స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఆ ఏడాది డిసెంబర్‌లోగా అది ఏర్పాటు కావాలి. 2023 సెప్టెంబరు వచ్చేసినా ఆచరణ కానరావడం లేదు. మరోవైపు ప్రపంచం వైపు చూస్తే గ్లోబల్ ఐటి సంస్థలు ఉద్యోగులకు ఉద్వాసనలు పలుకుతూనే ఉన్నాయి. 2008 నాటి ఆర్థిక సంక్షోభ ప్రకంపనలు అక్కడక్కడా కనిపిస్తునే ఉన్నాయి. అంతేగాక ఏదైనా ఒక ఐటి సంస్థ ప్రొడక్ట్‌ను అభివృద్ధి చేస్తే దాని సర్టిఫికేషన్ కోసం అహ్మదాబాద్, పూణె వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఎపిలో ఆ సర్టిఫికేషన్ రీసెర్చి సెంటర్లు తిరుపతి, విశాఖలో ఏర్పాటు చేస్తామంటూ 2014లో బిజెపి ఇచ్చిన హామీ మూటగట్టి గట్టవతల పడేసింది ఆ పార్టీ.

**విశాఖలో 120 సంస్థలు**

విశాఖ నగరంలో సుమారు 120 సంస్థలు సిరిపురం, సత్యం జంక్షన్, దసపల్లా, విఐపి రోడ్డు, రుషికొండల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇవన్నీ కలిసి రూ.2500 కోట్ల టర్నోవర్‌ను ఏటా సాధిస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం విశాఖను రాజధాని చేస్తున్నట్లు ప్రకటించాక కూడా పెద్దగా పెరిగిన సంస్థలేమీ లేవు. తాజాగా రుషికొండ హిల్ -2పై ఇన్ఫోసిస్ త్వరలో కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్లు బుధవారం సాయంత్రం ఆ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి ప్రకటించారు. గత తెలుగుదేశం హయాంలో కూడా విశాఖలో ఐటి రంగానికి పెద్ద పీటవేస్తామని చంద్రబాబు పలుమార్లు ప్రకటించి ఇలానే బోల్తాకొట్టించారు. పలు ఐటి సంస్థలను విజయవాడ, మంగళగిరికి మళ్లించారన్న విమర్శలు ఐటి రంగ నిపుణుల నుంచి ఉండనే ఉన్నాయి. మరోవైపు బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు విశాఖ కేంద్రంగా ఐటి అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందంటూ సాగిస్తున్న ప్రచారం అంతా ఇంతా కాదు. కేంద్ర సర్కారు నుంచి జరగాల్సిన ఎస్‌టిపిఐఎల్ క్లియరెన్స్ కూడా జివిఎల్ తేలేకపోయారు. నిరుద్యోగులు మాత్రం విశాఖ ఐటి రంగం ముందుకెళ్తుందా ? వెనక్కి పోతుందా ? అన్న ఆందోళనలో పడ్డారు. ఇన్ఫోసిస్ అయినా పని ప్రారంభిస్తే ఊరట కలుగుతుందంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సారా బట్టీపై పోలీసుల దాడి

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి :** మండలంలోని దూసరపాము పంచాయితీ సుబ్బంపాడు గ్రామ శివారు అటవీప్రాంతంలో అక్రంగా నిర్వహిస్తున్న నాటుసారా బట్టీపై రాజవొమ్మంగి స్టేషన్ హౌస్ ఆఫీసర్ టీజీ నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే 50 లీటర్ల బెల్లం ఊటను, పాత్రలను ధ్వంసం చేశారు. అక్రమంగా సారాబట్టి నిర్వహిస్తున్న దూసరపాము గ్రామానికి చెందిన జి వెంకన్నబాబును అరెస్ట్ చేశారు. ఆయన నుండి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అడ్డతీగల కోర్టులో హాజరు పర్చినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ నరేంద్ర ప్రసాద్ తెలిపారు.

# కిన్లీ వైజాగ్ బే మారథాన్ టీ షర్ట్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** కిన్లీ వైజాగ్ బే మారథాన్ ఎడిషన్ 6 ఈవెంట్ టీ షర్ట్‌ను బుధవారం నగరంలోని లాసన్స్ బే కాలనీలో విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ పొల్లాక్స్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ సందీప్ చిత్రతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సందీప్ చిత్ర మాట్లాడుతూ ఈ నెల 24న జరుగనున్న మారథాన్ ఆలోచింపజేస్తుందన్నారు. పది వేల మంది పాల్గొనే అవకాశముందని తెలిపారు. హాఫ్ మారథాన్, 10కె రన్, 5కె రన్, 3కె రన్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. మరింత సమాచారం కోసం www.vizagbay-marathon.in వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు.

# బడి భయం

### - కింద పడుతున్న స్లాబ్ పెచ్చులు
### - వర్షం పడితే పాఠశాల ఆవరణంతా నీరు
### - రామాలయానికి తరచూ విద్యార్థుల తరలింపు
### - ఇదీ వీరభద్రపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దుస్థితి
### - మంత్రి ముత్యాలనాయుడు నియోకవర్గంలోనే ఈ పరిస్థితి


పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, చీడికాడ విలేకరి**

ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దామని ప్రభుత్వం చెబుతున్న మాటల్లోని డొల్లతనం తెలుసుకోవాలంటే జిల్లాలోని చీడికాడ మండలం వీరభద్రపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను చూడాల్సిందే. జగన్ మామ... వీరభద్రపేట పాఠశాలలను బాగుచేస్తాడని నాడు-నేడు తొలి దశలో అక్కడి విద్యార్థులు ఆశపడ్డారు. తుదకు రెండో దశ నాడు-నేడులో కూడా ఈ పాఠశాల మరమ్మతులు చేపట్టకపోవడంతో వారంతా తీవ్ర నిరాశ చెందారు. వర్షం పడితే పిల్లలు కూర్చోడానికి భయపడేంత శిథిలావస్థలో పాఠశాల భవనం వుంది. వర్షం పడితే పాఠశాల వదిలి పక్కనున్న రామాలయంలోకి విద్యార్థులు వెళ్లాల్సివస్తోంది. పెద్ద వర్షానికి పాఠశాల ఆవరణలో నీరు చేరుతోంది. వరండాలో పెచ్చులు పడిపోవడంతో మూడు, నాలుగు, ఐదు తరగతులను ఒకే గదిలో కూర్చొబెట్టి పాఠాలు చెబుతున్నారు. ఒక్కో తరగతిని వేర్వేరుగా కూర్చోబెట్టడానికి అనువుగా పాఠశాల భవనం లేకపోవడంతో ఒకటి, రెండు తరగతులను ఒక గదిలోనూ, మూడు, నాలుగు, ఐదు తరగతులను ఒక గదిలోనూ కూర్చొబెడుతున్నారు. ఒకటి, రెండు తరగతుల పిల్లలు కూర్చొంటున్న గదిలో గోడ పెచ్చులు కిందపడుతున్నాయి. మూడు, నాలుగు, ఐదు తరగతుల పిల్లలు కూర్చొంటున్న భవనం స్లాబ్ పెచ్చులు కిందపడ్డంతో పిల్లలు భయంభయంతో వుంటున్నారు.

నాడు-నేడు తొలి దశలో దాదాపు రూ.150 కోట్లు వ్యయంతో 598 పాఠశాలలను, రెండో దశలో రూ.256 కోట్లతో 605 పాఠశాలలను తీర్చిదిద్దిన ప్రభుత్వం చీడికాడ మండలానికి చివరన వున్న వీరభద్రపేట ప్రాథమిక పాఠశాలను మాత్రం విస్మరించింది. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల పిల్లలు 25 మంది వున్నారు. పాఠశాల భవనం భయంకరంగా వుండడంతో మూడో తరగతి చదువుతున్న కొల్లి లోహిత్, వంటాకుల రోష్నిని తల్లిదండ్రులు ఆరు కిలోమీటర్ల దూరంలోని మాడుగుల ప్రయివేటు పాఠశాలకు పంపిస్తున్నారు. స్థానిక పాఠశాలకు మరమ్మతులు చేపట్టకపోతే వచ్చే ఏడాది మరికొంతమంది పిల్లలను ప్రయివేటు పాఠశాలకు పంపించాలన్న ఆలోచనలో తల్లిదండ్రులున్నారు. ఇక్కడ ఉపాధి హామీ నిధులతో పాఠశాల ప్రహరీ నిర్మించి, పిల్లలు కూర్చొనే పాఠశాల భవన మరమ్మతులు విస్మరించారు. వర్షానికి స్లాబ్ పెచ్చు గౌనుపై పడినప్పటి నుంచి స్కూల్‌కు రావాలంటే భయమేస్తోందని మూడో తరగతి విద్యార్థి సబ్బవరపు జ్యోష్న 'ప్రజాశక్తి' ముందు వాపోయింది. పాఠశాల మరమ్మతుల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. పేద పిల్లలకు పెద్ద దిక్కుగా వున్న ఈ పాఠశాలకు మరమ్మతులు చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడం విచారకరం. ఈ పాఠశాల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు నియోజకవర్గ పరిధిలో వుంది. సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు తెలిపారు.

**పెచ్చులు పడిపోతున్నాయి**

స్కూల్ బాగోలేదు. పెచ్చులు పడిపోతున్నాయి. వర్షమొస్తే కారిపోతోంది. తడిసిపోతున్నాం. వర్షం వచ్చినప్పుడు రామాలయంలో క్లాసులు పెడుతున్నారు.

**కక్కల జాహ్నవి, నాలుగో తరగతి**

**బడంటే భయమేస్తోంది**

వర్షమొస్తే పెచ్చులూడి పడిపోతున్నాయి. కారిపోవడంతో పుస్తకాలు తడిసిపోతున్నాయి. రోజుకు ఏదో ఒక చోట పెచ్చు పడిపోతోంది. బడి అంటే భయమేస్తుందిగానీ.. చదువుపోతుందని స్కూల్‌కు వస్తున్నాం. వేరే చోటకు వెళ్లిపోవాలనిపిస్తోంది. ఆరు నుంచి హాస్టల్‌కు వెళ్లిపోవాలనుకుంటున్నాను. బడి బాగుచేయాలి.

**బోగం చరణ్, ఐదో తరగతి**

# పౌష్టికాహారంతో ఆరోగ్యం

**ప్రజాశక్తి-రంపచోడవరం**

గర్భిణులు పౌష్టికాహారం పూర్తిస్థాయిలో తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఎంపీపీ బందం శ్రీదేవి సూచించారు. మండలంలోని ఐ.పోలవరం పంచాయతీ సీతాపల్లి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశు మరణాలు లేకుండా అంగన్వాడీస్థాయి నుంచి పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం కిట్లు ఇస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ప్రీ స్కూల్ పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంజం వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వంశి, సచివాలయం కన్వీనర్ కుంజం రామకృష్ణ, సీడీపీఓ సంధ్యారాణి, సూపర్‌వైజర్, అంగన్వాడీ టీచర్లు, మహిళ పోలీస్ పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవాల్లో పాల్గొన్న ఎంపిపి శ్రీదేవి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బాలాజీ బాబు, కొండా జాకబ్

# క్రీడల్లో రాణించాలి

**ప్రజాశక్తి-మారేడుమిల్లి**

బాల, బాలికలు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, సర్పంచ్ కొండా జాకబ్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం వారు సందర్శించారు. మండలంలోని పాఠశాలకు చెందిన 14 నుంచి 17 సంవత్సరాలు లోపు బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్-బాడ్మింటన్, టెన్ని కాయిట్, షటిల్, అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి క్రీడల ద్వారా విద్యార్థులలోని దాగి ఉన్న ప్రతిభ బయటకు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖధికారి తమ్మారావు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల కో-ఆర్డినేటర్ బి. సుదర్శన్ రావు, జెడ్పీ పాఠశాల హెచ్ఎం నీలయ్య, పలు పాఠశాల పీఈటీలు, క్రీడకారులు పాల్గొన్నారు.

# జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** జిల్లాలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత శాఖల అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లాలోని జగనన్న కాలనీ లే-అవుట్‌ల ఇళ్ల నిర్మాణంపై వెబెక్స్ ద్వారా జిల్లాలోని ఎస్ఇలు, డిఇలు, ఎఇలు, జివిఎంసి అధికారులు, అన్ని మండలాల ఎంపిడిఒలు, గుత్తేదారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో సకాలంలో ఇళ్ల నిర్మాణం జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సమీక్షలో పాల్గొన్న అధికారులను ఆదేశించారు. బిలో బేస్మెంట్ స్థాయిలో ఉన్న గృహాలన్నింటినీ బేస్మెంట్ స్థాయికి తీసుకురావాలన్నారు. బేస్మెంట్ లెవెల్ అంతకన్నా ఎక్కువ స్థాయిలో ఉన్న గృహాలన్నింటినీ రూఫ్ క్యాస్టింగ్ స్థాయికి తీసుకురావాలన్నారు. ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి స్టేజీ అప్డేషన్ చేయాలన్నారు.

పని ప్రారంభించిన ప్రతి ఇంటికీ బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, స్టీల్, సిమెంట్‌లను లేఅవుట్లకు ఎప్పటికప్పుడు సరఫరా చేసేలా చూడాలన్నారు. లేబర్ సమస్య లేకుండా చూడాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. సోక్ పిట్స్ నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. కాలనీల ఆర్చ్ నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్టేజ్ అప్డేట్ ఆప్షన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని చెప్పారు. నిర్మాణ సమయంలో కాలనీల్లో కరెంట్ కొరత లేకుండా చూడాలని ఏపిఈపిడిసిఎల్ ఎస్ఇని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, విఎంఆర్‌డిఏ అధికారులు పాల్గొన్నారు.

# నేడు సిపిగా రవిశంకర్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖ నగర పోలీస్ కమిషనర్‌గా ఐజీగా నియమితులైన 1994 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ఎ.రవిశంకర్ బుధవారం సాయంత్రం విశాఖకు చేరుకున్నారు. ఆయన గురువారం ఉదయం 11 గంటలకు నగర పోలీస్ కమిషనరేట్‌లో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసి బదిలీపై విశాఖకు వచ్చారు. ఇప్పటి వరకూ పోలీస్ కమిషనర్ విధులు నిర్వహిస్తున్న 2005 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన సిఎం త్రివిక్రమ్ వర్మ ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగానికి బదిలీపై వెళ్లనున్నారు.